క్లుప్తంగా

11వ అదనపు జిల్లా జడ్జిగా మహేష్



పీలేరురూరల్ : పట్టణ 11వ అదనపు జిల్లా జడ్జిగా ఎ. మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు ఇన్‌చార్జి 11వ అదనపు జిల్లా జడ్జిగా పని చేసేవారు. వారి స్థానంలో అనంతపురంకు చెందిన ఎ. మహేష్ హైకోర్టు ఆదేశాల మేరకు కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా 11వ అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు.

మొక్కలు, నీటి తొట్టెలు అందజేత

కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండకు ఐసీఐసీఐ ఫౌండేషన్ శరత్‌కుమార్ శుక్రవారం 600 మొక్కలు, మూడు నీటి తొట్టెలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. మండల ఉపాధి హామీ ఏపీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం జరుగుతుందని తెలిపారు.

రేపు టౌన్‌బ్యాంకు మహాజనసభ

మదనపల్లె సిటీ: మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు వార్షిక మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు బ్యాంకు సీఈఓ పి.వి.ప్రసాద్ తెలిపారు. సీటీఎం రోడ్డులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశం జరుగుతుందన్నారు. ఏ తరగతి సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

కలకడ : అన్ని వేళలా ఆదాయం కోసమే కాకుండా సమాజ సేవలో కూడా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్‌ఐ రామాంజనేయులు కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నవ్యాంధ్ర టు వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోషియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని ద్విచక్రవాహన మెకానిక్‌లు ఎస్‌ను కలిసి సన్మానించారు. సామాన్యులపై సానుభూతి–క్షమ గుణం కలిగి ఆదుకోవాలని యూనియన్ సభ్యులు ఎస్‌ఐని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మహమ్మద్‌రోష, మహబూబ్‌బాష, హసన్, మొహిద్దీన్, సయ్యద్‌బాష, సద్దాం, రియాజ్ పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్‌సీపీ నేతల గృహ నిర్బంధం

కలికిరి: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరుపతి పర్యటనకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తుగా శుక్రవారం ఉదయం నుంచి గృహ నిర్బంధం చేశారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్ కుటుంబ సభ్యులు, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలను ఇంటికే పరిమితం చేస్తూ పోలీసులు కాపలాఉన్నారు. సాయంత్రం వరకు పోలీసులు గృహ నిర్బంధం కొనసాగించారు.


విద్యుత్‌శాఖ డీఈఈగా హరికుమార్

మదనపల్లె సిటీ: మదనపల్లె విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్‌గా వై.హరికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీఈఈని విద్యుత్ ఓసి అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అసోసియేషన్‌కు సహకారం అందిస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యక్రమంలో అధ్యక్షులు రామలింగారెడ్డి, కార్యదర్శి శేషాద్రి నాగరాజు, రఘు, మురళి, రామకృష్ణ, డి.రామలింగారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఆనందరెడ్డి కలాంబాషా, సాయిప్రతాప్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రారుగా పార్థసారధి

కలికిరి: కలికిరి సబ్ రిజిస్ట్రారుగా పార్థసారధి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రారుగా ఉన్న ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కలికిరి కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా ఇక్కడ పని చేస్తున్న సబ్ రిజిస్ట్రారు సత్యప్రసాద్ చిత్తూరు జిల్లా కార్వేటినగరం కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అలాగే వాల్మీకిపురం కార్యాలయం నుంచి కలికిరి కార్యాలయానికి బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్ జశ్వంత్ రాయల్ శుక్రవారం విధులలో చేరారు.

జేఎన్టీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



ప్రశాంత్

కలికిరి: కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రశాంత్ అనంతపురంజేఎన్టీయూ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఫిజిక్స్ విభాగంలో స్ట్రక్చర్ ఎనర్జీ ట్రాన్స్‌ఫర్ స్టడీస్ ఆఫ్ రేర్ ఎర్త్ డోప్డ్ బిస్మత్ బోరేట్ గ్లాసస్, అప్లికేషన్స్ ఇన్ ఆప్టికల్ ఆమ్లిఫికేషన్ అనే అంశంపై పరిశోధన సమర్పణకు గాను యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూవేషన్ నాగప్రసాద్ నాయుడు నోటిఫికేషన్ జారీ చేశారు. నంద్యాల ఆర్జీయూకేటి కళాశాల ఫిజిక్స్ హెచ్ఓడీ డా. రవి, కలికిరి కళాశాల ప్రొఫెసర్ త్యాగరాజన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ సాధించినట్లు ప్రశాంత్ తెలిపారు.

మెడికల్ కాలేజీ విషయంలో రాజకీయాలు వద్దు

- పనులు పూర్తిచేయించి ప్రభుత్వ ఆధ్వర్యంలో కళాశాల నడపాలి
- రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ) డిమాండ్



మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణపనులు పూర్తిచేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగించాలని ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్ఎస్ఓ నాయకులు

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మదనపల్లెలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ విషయంలో రాజకీయాలు పక్కనపెట్టి, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్మాణ పనులు కొనసాగించాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్(ఆర్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు జగన్ అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయించడం దారుణమని శుక్రవారం సబ్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణపనులు పూర్తిచేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కళాశాల కొనసాగించాలని సబ్ కలెక్టరేట్ ఏఓ. పద్మావతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ నిర్మాణపనులు వేగంగా జరిగి దాదాపు 75శాతం పూర్తి అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలనే దురాలోచనతో రాజకీయ కుట్రలో భాగంగా ఉద్దేశపూర్వకంగానే పనులు నిలిపివేయించిందన్నారు. మెడికల్ కాలేజీ పనులు నిలిపివేయడం ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నతవిద్య అవకాశాలు, అభివృద్ధిని అడ్డుకున్నట్లేనని విమర్శించారు. రాయలసీమలో కరువుతో కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటే...వైద్యవిద్యను అభ్యసించాలనుకున్న విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్లి కోట్లు ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం వైద్యవిద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా, ముఖ్యంగా రాయలసీమకు మంజూరైన మెడికల్ కాలేజీలను నిలుపుదల చేయించడం అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రద్దుచేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలన్న దురాలోచనలతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కాలేజీలను ప్రారంభించకుండా నిలిపివేయించారన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే, పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని, రిజర్వేషన్ల ఊసే ఉండదన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీకి వచ్చిన 50 సీట్లను వద్దని రాసిన లేఖను వెనుకకు తీసుకుని, మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణపనులను త్వరితగతిన పూర్తి చేసి ఆధ్వర్యంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో విద్య, వైద్యం అందించడంలో రాష్ట్రప్రభుత్వం ముందుండి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: కిశోర బాలికల గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిల శరీరం, భుజాలపై చేతులు వేయడం వంటివి ఎవరైనా చేస్తే వెంటనే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎవరైనా అపరిచితులు బైక్, ఆటో, సైకిల్‌పై లిఫ్ట్ ఇస్తామని చెప్పి పిలిస్తే వెళ్లకూడదన్నారు. అత్యవసర సమయాల్లో 100, 112, 1098 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. బాల్య వివాహాల వలన భవిష్యత్తు ఉండదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి అమృత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీపల్లె ఎంపీడీఓగా సుధాకర్

కేవీపల్లె : కేవీపల్లె ఎంపీడీఓగా జి. సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న యాదవేంద్ర బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు. చౌడేపల్లె ఎంపీడీఓగా ఉన్న సుధాకర్ బదిలీపై కేవీపల్లెకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మదనపల్లె : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 రాష్ట్రస్థాయి పోటీలకు మదనపల్లె ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న జి.లోహిత్, ఎంపికయ్యాడని స్కూల్ చైర్‌పర్సన్ అమృత, శ్రీదేవిలు తెలిపారు. శుక్రవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...సెప్టెంబర్ 26న డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చిత్తూరులో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయన్నారు. వీటిలో తమ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న లోహిత్ అండర్–14 కేటగిరీలో 100మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థానంలో నిలిచాడన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సవరణ



మాట్లాడుతున్న ఈఆర్ఓ రమాదేవి

పీలేరు : ఓటర్ల సవరణ పారదర్శకంగా చేపట్టాలని ఈఆర్వో రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చనిపోయిన వారిని, వివాహం అయి బయట ఊర్లకు వెళ్లిని వారి ఓటర్ల జాబితా నుంచి తొలగించుటకు సహకరించాలన్నారు. 1500 ఓటర్లుకు మించినచో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్పులు, చేర్పులు చేయడం నిరంతరం ప్రక్రియ అని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఈ, ఏఈల బదిలీ

బి.కొత్తకోట: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న డీఈఈ, ఏఈఈలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తంబళ్లపల్లె డీఈ శ్రీహరిని చిత్తూరుజిల్లా నగరికి, కడపలో పని చేస్తున్న డీఈ పి.విద్య లక్కిరెడ్డిపల్లెకు, పీలేరులో పనిచేస్తున్న డీఈ టి.రెడ్డెప్ప మదనపల్లెకు, చిత్తూరులో పనిచేస్తున్న కే.చిన్నరెడ్డెప్ప పీలేరుకు బదిలీ అయ్యారు. తంబళ్లపల్లె డీఈగా ఎవరిని నియమించలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పనిచేస్తున్న ఏఈలు బదిలీ అయ్యారు. బి.కొత్తకోటలో పనిచేస్తున్న దినేష్ ములకలచెరువుకు, పెద్దతిప్పసముద్రంలో పనిచేస్తున్న బి.హరి కురబలకోటకు, ములకలచెరువులో పనిచేస్తున్న కే.బాలచంద్రాచారీ పెద్దతిప్పసముద్రంకు, తంబళ్లపల్లెలో పని చేస్తున్న అశోక్‌కుమార్ పెద్దమండ్యంకు, పెద్దమండ్యంలో పనిచేస్తున్న హరిప్రసాద్ చిత్తూరుజిల్లా నగరికి, కురబలకోటలో పనిచేస్తున్న హేమకుమార్ బి.కొత్తకోటకు, రామసముద్రంలో పనిచేస్తున్న వినోద్‌కుమార్ తంబళ్లపల్లెకు బదిలీ అయ్యారు.

పరిసరాల శుభ్రతతో ప్రజారోగ్యానికి భద్రత

కేవీపల్లె : పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యానికి భద్రత లభిస్తుందని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్టలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అపరిశుభ్రమైన పరిసరాలతో దోమలు, బొద్దింకలు, ఇతర క్రిమికీటకాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. కలుషిత ఆహారం, కలుషిత నీరు వల్ల అతిసార, టైఫాయిడ్, కామెర్లు లాంటివి వ్యాప్తి చెందుతాయన్నారు. చికెన్ సెంటర్లు, హోటల్లు, టీస్టాల్, బేకరి యజమానులు వ్యర్థ పదార్థాలు ఎక్కడపడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, రుక్మిణి, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లె పంచాయతీ గుడిశవానిచెరువు కట్టపై రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా గుడిశవారిపల్లెకు చెందిన గ్రామస్తులు చెరువులో నిమజ్జన కార్యక్రమం చేసి తిరిగి వస్తున్న సమయంలో ట్రాక్టర్ చెరువులోకి బోల్తా పడి ఒక విద్యార్థి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గుడిశవానిచెరువు వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కట్టపై ఏర్పాటు చేసిన రోడ్డు వెడల్పు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. కట్టపై రోడ్డు వెడల్పు కోసం ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈక్రమంలో చెరువు కట్టపై రోడ్డు వెడల్పు కోసం రూ. 40 లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు నివేదించారు. కలెక్టర్ నిధులు కేటాయించడంతో కట్టవద్ద రోడ్డు విస్తరణ పనులను హిటాచీ యంత్రంతో చేపట్టారు. పనులను టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ విశ్వనాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర రెడ్డి, గల్లా నారాయణ, సీతాపతిరెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ హమాలీలకు కూలిరేట్లు పెంచాలి

మదనపల్లె : సివిల్ సప్లైస్ గోడౌన్ హమాలీలకు కూలీరేట్లు పెంపుచేసి, ఎరియర్స్‌తో కలిపి జీఓ విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవా, పట్టణ కార్యదర్శి తిరుమల డిమాండ్ చేశారు. సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రసమితి పిలుపు మేరకు మూడురోజుల మెరుపుసమ్మెలో భాగంగా బుధవారం మదనపల్లె సివిల్ సప్లై పాయింట్ వద్ద మూడుగంటల సేపు పనులు నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ..కూలీరేట్ల అగ్రిమెంట్ పెంపుదల జనవరి1, 2024 ప్రకారం కొత్త కూలీరేట్లను పెంచి అమలుచేయాల్సిన సివిల్ సప్లైస్ యాజమాన్యం, రాష్ట్రప్రభుత్వం 9 నెలలు కావస్తున్నా, ఇప్పటివరకు ఎటువంటి జీఓను విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లాస్థాయి అధికారుల అలసత్వంతో మొదటివారంలో కూలీలకు జీతాలు అందడం లేదని ఆరోపించారు. రూట్ ఆప్టిమేషన్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, అయూబ్, విజయ్‌కుమార్, వీరాంజనేయులు, మహమ్మద్‌రఫీ, మస్తాన్, ముబారక్, జగదీష్, నదీమ్, దిలీప్, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కలకడ : ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయభారతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కలాశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 120మంది విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున సహకారంతో హాజర రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అత్యవసర సమయంలో రక్తదానం చేయాలన్నారు. కర్త దానం ప్రాణదానంతో సమానమని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పుష్పకుమారి పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ: భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. స్వాతంత్ర్యం సిద్ధింపజేయుటకు అతి చిన్న వయస్సులో ఉరికంభంను ముద్దాడిన గొప్ప వీరుడన్నారు. అనేక ఉద్యమాలకు విద్యార్థి, యువతను తీసుకువచ్చారన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ, ప్రైవేటు స్కూల్స్ నాయకులు కేశవరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ సేగు రెడ్డప్పరెడ్డి, న్యాయవాది సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్టాక్ పాయింట్ తనిఖీ



స్టాకు పాయింట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

కలికిరి: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను శుక్రవారం సాయంత్రం మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎస్ పాయింట్ కేంద్రంలో స్టాక్‌ను, పామాయిల్ నాణ్యత, స్టాకు నిల్వను పరిశీలించిన ఆయన రికార్డులను తనిఖీ చేసి ఎంఎల్ఎస్ డీటీ హరితను వివరించారు. చౌకదుఖానాల డీలర్లకు కొలతలలో తేడా లేకుండా సరఫరా చేయాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ఫ్రీహోల్డ్ రీ సర్వే పురోగతిని పరిశీలించారు. రీ సర్వేలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని రెవెన్యూ సిబ్బందిని ఆయన ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేయాలని, రికార్డులను నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు మహేశ్వరి బాయ్, డీటీ నవీన్, వీఆర్ఓలు విశ్వనాథ, చంద్రయ్య, శ్రీనివాసులు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న కొత్తపల్లె వైస్‌సర్పంచ్ నందకుమార్

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె సమీపంలో ఎస్.ఎస్.గ్రానైట్స్ క్వారీ నిర్వహణకు అనుమతులపై ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభాభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామ సర్వేనెంబరు.350లో 7.947 హెక్టార్ల కలర్ గ్రానైట్ మైన్‌కు అనుమతులు కేటాయించేందుకు డీఆర్వో సత్యనారాయణ సమక్షంలో ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. క్వారీ నిర్వహణకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు ఉంటే తెలపాలని డీఆర్వో కోరారు. ఈ సందర్భంగా కోటవారిపల్లెకు చెందిన ప్రజలు...తమ గ్రామసమీపంలో 11 క్వారీల వరకు అనుమతులిచ్చారని, ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా క్వారీల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పిస్తామని చెప్పడం తప్ప, ఇప్పటివరకు చేసిన దాఖలాలు లేవన్నారు. క్వారీ పేలుళ్లతో బోరుబావులు పూడిపోయి, రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రోడ్డు దెబ్బతింటోందన్నారు. అనంతరం ఎస్.ఎస్.గ్రానైట్స్ యజమాని మాట్లాడుతూ...నిబంధనల ప్రకారం చేయాల్సిన పనులన్నీ తప్పక చేస్తామని, గ్రామస్తులు తమకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ సుధ, అనిల్‌రెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, కొత్తపల్లె వైస్‌సర్పంచ్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం



డ్రమ్ముల్లో నిలువ ఉంచిన నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

పెద్దమండ్యం: మండలంలోని సి గొల్లపల్లె పంచాయతీలోని గంగతాతగారిపల్లె, చిన్నాయునివారిపల్లె, సీ గొల్లపల్లె ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 1200 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఐ పి. వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీ గొల్లపల్లె, చిన్నాయునివారిపల్లె, గంగతాతగారిపల్లె గ్రామాల సరిహద్దు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ డ్రమ్ములు, వంట పాత్రల్లో నిలువ ఉంచిన నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ పిజిఖాన్, క్రిష్ణమూర్తి, ఎస్‌బి కానిస్టేబుల్ మెహబూబ్ లు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలతోనే క్షయవ్యాధి నివారణ

గుర్రంకొండ: బీసీజీ టీకాలతోనే క్షయవ్యాధిని నివారించవచ్చని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, వాల్మీకీపురం టీబీ యూనిట్ పర్యవేక్షులు నాగిరెడ్డిలు అన్నారు. మండలంలోని తరిగొండపంచాయతీ కురవపల్లెలో శుక్రవారం నిర్వహించిన 104 శిబిరంలో బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం బీసీజీ టీకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వయోజనా బీసీజీ టీకాలు మరణాల తీవ్రతను నివారించడంలో కీలకమన్నారు. టీబీకి వ్యతిరేకంగా మనిషిలో రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఈ అవగాహన సదస్సులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బీసీజీ టీకాలు ఎటువంటి అనుమానాలకు తావులేకుండా వేసుకోవచ్చన్నారు. 60 సంవత్సరాలు వయస్సు పెబడ్డవారు, పొగపీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీ జబ్బుతో కోలుకొన్నవారు, వారికుటుంబ సభ్యులు టీకాలు వేసుకోవడానికి అర్హులన్నారు. 2025 లోగా టీబీ ముక్తభారత్ లక్ష్యసాధనకు అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని టీబీ వ్యాధిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది సురేఖ,104 సిబ్బంది పాల్గొన్నారు.

30న హార్సిలీహిల్స్ సొసైటీ సమావేశం

బి.కొత్తకోట: ఈనెల 30న మదనపల్లెలో హార్సిలీహిల్స్ సహకార గృహ నిర్మాణ సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. 10 గంటలకు జరిగే సమావేశంలో లోకాయుక్త ఆదేశాల మేరకు ఒక కుటుంబంలో ఒకరి మాత్రమే సభ్యత్వం ఉండాలని, కోర్టు వ్యవహారాలకు సంబంధించి చర్చించడం జరుగుతుందని, సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మునెప్పకాలనీలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయానికి సమీపంలోని మునెప్పనాయుడు కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రశాంతతకు, పచ్చని చెట్లకు, ఆహ్లాదకరమైన వాతావరణానికి పేరుమోసిన మదనపల్లె నేడు కాలుష్యపు కోరల్లో పచ్చదనం కోల్పోతోందన్నారు. పట్టణంలో తిరిగి పచ్చదనాన్ని తీసుకువచ్చేందుకు పెద్దసంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు నాదెళ్లశివ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ మండల స్థాయి పోటీలు

గుర్రంకొండ: గుర్రంకొండలో స్వర్ణాంధ్ర విజన్ 2047కు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన పోటిలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 50 విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు త్వరలోనే బహుమతులు ప్రదానం చేస్తామని ఎంఈవో సుబ్రమణ్యం తెలిపారు. ఉపాధ్యాయులు రమేష్, హర్ష, వెంకటరమణ, భరతభూషణ్‌లు పాల్గొన్నారు.

వందరోజులైనా జిల్లా ఊసేదీ..?

– జిల్లా సాధనసమితి కన్వీనర్ శివప్రసాద్

మదనపల్లె : కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తయినా మదనపల్లె జిల్లా ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించలేదని, అలాంటప్పుడు ఇది మన మంచి ప్రభుత్వమని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల ప్రజలు ఎలా భావిస్తారని మదనపల్లె జిల్లాసాధన సమితి కన్వీనర్ పీటీయం.శివప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం జిల్లాసాధనసమితి కన్వీనర్ హోదాలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో..యువగళం పాదయాత్రలో నారాలోకేష్, ఎన్నికల ప్రచారసభలో చంద్రబాబు...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లె జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం వందరోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా మన మంచి ప్రభుత్వం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజలు ముందుకు వెళుతున్నారు. మదనపల్లెను జిల్లా చేసేంతవరకు టీడీపీని మంచి ప్రభుత్వమని ప్రజలు విశ్వసించరన్నారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం ఆవులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెడ్‌మాస్టర్ రవికుమార్ తెలిపారు. అండర్–14 కబడ్డీ బాలికల విభాగంలో శైలజ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. అండర్–14 వాలీబాల్ బాలుర విభాగంలో నందకిషోర్ ఎంపికయ్యాడు. పాఠశాల కమిటీ చైర్మన్ చెన్నకేశవులు, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, మురళి, జయరాం, శ్రీరాములు అభినందించారు.